
# వంట నేర్పిన భర్త

"ఎన్నాళ్ళయింది శుభ్రంగా వంటలు నా చెయ్యడం రాకుండా! ఛీ ఛీ- ఏమిటీ కూర! యిది వంకాయకూరేనా? దాని రుచి, అంతా చెడగొట్టేశావు! శెనగపప్పూ, బొబ్బర్లూ, అల్లం, పచ్చిమిరపకాయలూ గుమ్మడొడియాలముక్కలూ, యివన్నీ దాని హంగులు! అవి వుంటేనే వంకాయముద్ద. రాత్రికి నేను తయారు చేస్తాను చూడు! ఆ వేళ తిన్నావు తెలీదూ!" అని గొణుగుతూ అంటున్నాడు చంద్రం, అన్నానికి కూర్చుని కూరగొ్రకముందే!

ఇలా అంటాడని కమలకి తెలుసు. కమల భయపడుతూనే వుంటుంది అయినా ప్రతి రోజూ చివాట్లు తప్పవు మెతుకు మెతుకూ ఎంగిలి ... గొణుగుతూనే వుంటాడు అది తనకి కొత్తకాకపోయినా ఆడదయిన తర్వాత వంటవిషయంలో - ఆ డిపార్టుమెంటుతో సంబంధంలేని మొగవాడు ఎత్తిపొడుస్తూ ఎంచుతూంటే ఏ స్త్రీ సహిస్తుంది! దానికన్నా అవమానం వేరేవుందా?

నిజానికి చంద్రం బాగానే వండగలడు. గవర్నమెంటువారి పుణ్యమా అని యీ బేసిక్ ట్రయినింగులో ఆరితేరిన అయ్యవారి పెళ్ళాలందరికీ యీ సుఖం లభించింది - అగాలితే అంటే కాళీగా వుండే మూడురోజుల్లోనూ కడుపులో చల కదలకుండా నవరుచులతోనూ, నాలికమీద పెట్టుకుంటే జిహ్వ లేచి వస్తుందా అన్నట్టువంటి భోజనం దొరుకుతుంది - సాధారణంగా ఆడవాళ్లకటువంటి భోజనసుఖం అబ్బడం మహా అదృష్టమన్నమాటే! ఆ మూడురోజులూ భర్త వండిన అన్నం తినేకన్న ఉపవాసం నయం అనుకున్నవాళ్ళూ వున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బేసిక్ ట్రయినింగ్ అయిన అయ్యవారిని వరించిన ఆడదానిదే అదృష్టమంటాను. దానికి వాళ్ళెటువంటి నోములు నోచేరో!

అటువంటి వాడే చంద్రం కూడా - కమలకి ఆ భాగ్యం కలగడం బాగానేవుంది గాని, రోజూ భర్త వంకతాననా వుండగలడా - అందుకే తను వండి నానా తిట్లూ



తింటున్నాది. చంద్రం వండడం ఎలాగూ మానడు. ఎందుకంటే తనకి ఆ వేళలో బరి వుండదు కాబట్టి, వృత్తినే ఆలా వుంటే తోచదుట! ట్రయినింగు స్కూల్లో అలవాటవడంవల్ల మనస్సు వంటింటివేపే వుంటుంది! అక్కడికీ కమల బొత్తిగా ఒప్పుకోనప్పుడు, అలాగూ, యిలాగూ, అని చెబుతూనే వుంటాడు. కమల వప్పుగుంటే రోజూ రెండుపూట్లా వండడానికి తనకేమీ అభ్యంతరం లేదు.

కమలది అమృతహస్తం వంటలో ఆమె అన్నపూర్ణ, అన్నివిషయాల్లోనూ ఆమెలో ఏదో వొక ప్రత్యేకత వుంటూంటుంది. అయినా భర్తదగ్గర మెప్పు పొందలేకపోతున్నాది ఇహ శని ఆదివారాలు వచ్చేయంటే, చంద్రం గిన్నె గరిటా వదలడన్నమాటే! ఆ వేళ ఒక గండం, పోనీ ఏదోవండి పడేస్తాడా అంటే కమలని వదుల్తాడా! దగ్గర కూర్చోబెట్టుకొని పాకశాస్త్రం అంతా చెప్పి వల్లించమంటాడు! అతని వుపదేశం యీమె పాకం అయేటప్పటికి తద్దినం భోజనంలాగా ఏ మూడో, నాలుగో అవతలిసిందే!

ఆదివారంనాడు వంటసరంజా అంతా చుట్టూ పేర్చుగొని కూర్చున్నాడు! కమల చేతులు కట్టుగొని వింటూ నిలుచుంది—

చంద్రం ఉపోద్ఘాతం మొదలెట్టేడు.

"వింటున్నావా! యివాళ పులిహోర చేస్తాను! నేను బేసిక్ ట్రయినింగవుతున్నపుడు నాలా ఎవరూ వంట చెయ్యలేకపోయేవారు; నేను వంటబేచ్‌లో పడ్డానంటే - ఆ వేళ అందరికీ ఓ పెద్దపండగలాగూ సంతర్పణలాగూ వుండేది! నా ఎడంచెయ్యి నలుడూ కుడిచెయ్యి భీముడూ అనుకో! అందులోనూ యీ పులిహోర చేసేనంటే రాసులు రాసులు ఇట్టే తినేసేవారు! ఇవాళ నీకు పులిహోర గురించి చెబుతాను విను, మళ్ళీ చెయ్యాలంటే టక్కున చేసెయ్యాలి!"

కమల వస్తూన్న నవ్వు ఆపుగుంటూ వింటున్నది.

బియ్యం ఎసరుపెట్టేడు. వుడుకుతోంది

"ఇదుగో చూశావా! యిప్పుడు కొంచం బిరుసుగా వుండగానే తీసి వార్చెయ్యాలి! ఆతర్వాత పులిహోర ఎక్కువ తక్కువనిబట్టి పొడుం పట్టు అంతలేసి పసుపు యిలా వెయ్యాలి!" అంటూ మూడుసార్లు వేసేడు.

"లేకపోతే ఎక్కువయిపోయి వెధవ వాసన వేసేస్తుంది!" అంటూ చాపమీద గుమ్మరించేడు—

"ఇదిగో! వెళ్ళి అయిదారు బొట్టలు చింతపండుతీసుకురా! ఎక్కువ వద్దు!"



నమోవాకం
చిత్రకారుడు—ఆర్. వెంకటరావు.

అని కమలతో చెప్పేడు. ఆమె తెచ్చి యిచ్చింది

"ఇప్పుడు చూడు!" అన్నాడు. అని చింతపండుపులుసు చిక్కగా పిసిగి "చిక్కగా వుండాలిసుమా!" అని హెచ్చరిస్తూ పోసేడు.

ఆతర్వాత కరివేపాకు నాలుగంటే నాలుగు రెమ్మలు తెల్చి వేశాడు, అల్లం, పచ్చిమిరపకాయలూ, లెక్కగా చితక్కొట్టి తెమ్మని, ఆమె తేగా దాంటో వేసేడు. మినప్పప్పు, ఎండుమిరపకాయలూ, ఆవాలూ, శనగపప్పూ ఒక గరిటెలో వేయించి ఆ పోపూ - నువ్వులగుండా, నిమ్మకాయరసం, వేసేడు, యింగువ, తెమ్మన్నాడు. కమల యింగువ పలుకులే వేయబోగానే ♥ లా కొట్టి దంటూ—దాన్ని కేరే గిన్నిలో నీళ్ళతో కలిపి ఆ పాలు తగుమాత్రం వేసి అటూ యిటూ పూర్తిగా పులిహోర పోసుఅంతా కలిపేడు.

"ఇహ రుచి చూడు నీ జన్మలో ఎరుగుదువేమో!" అన్నాడు గర్వంగా— యిద్దరూ రుచి చూశారు. కమల ఏం చెప్పగలదూ? అమోఘంగా కోవిలసద్దెలాగుంది! తన మొగుడేకదా యింత ప్రజ్ఞావంతుడని లోలోనే మురిసిపోయిందో యేమో గాని,

# వంట నేర్చిన భర్త

పైకిమాత్రం పులిహోర పిడచ ఒకటి చేసి చంద్రంనోట్లో మహానాజూకుగా పెట్టింది. అదీ జవాబు!

కమలకింకేం కావాలి! తనకా యింట్లో వంట పని తప్పిస్తే అప్పట్లో మరే పనీ లేదు. అదీ ఏదో మిషమీద వారం మొత్తం మీద అయిదారు రోజులు ఆయనే వండేస్తూంటే అంతకన్నా అమరసుఖం ఏముంది? అదే బాగుం దనుకుంది. ఎన్ని జన్మలెత్తినా యిటువంటివారే గాభర్తదొరకాలని దణ్ణం పెట్టుకుంటూం దేమో!

అయితే దీనికంతటికీ కారణం మరే వుద్యోగమూ దొరక్క, తగినంత చదువు చదవలేకో - హైయర్ గ్రేడు, సెకండరీ గ్రేడు ట్రయినింగుకుపోయి, అయ్యవారుద్యోగంలో ప్రవేశించడం, గవర్నమెంటువారు ఆలోచించి పెట్టిన బేసిక్ ట్రయినింగు విధిలేక అవడం, ఏలా అయితేనేమి యీ విషయంలో ఆడవాళ్ళందరూ గవర్నమెంటువారికి కృతజ్ఞులయి వుండాలి. వారి ఋణం తీర్చుకోలేరు. అయితే అందరిమాట ఏమోగాని కమలకి ఒక చిన్న బాధ లేకపోలేదు.

ఈ ఒక్కదానిలోనే ఆయనగారి బేసిక్ ట్రయినింగు ప్రజ్ఞ చూపెట్టి వూరుకుంటే బావుండును! అక్కడే అయిపోయిన అలవాటుచేత ప్రతిదానిలోనూ కలగజేసుకుంటారు కద! ఇలా యింట్లో జనానా చెయ్యవలసిన పనుల్లో తను కలగజేసికొని ఆమెగారిని కూర్చోబెట్టి తనే పరిష్కారం చేస్తూంటే కమలలాంటి దెవర్తో అలా అయినప్పటికీ లొంగివుందిగాని, మరోలాటివారయితే నాలుగు రోజులకే నెత్తికెక్కరూ? కేవలం దీనివల్ల ఏమీ తెలియనివాళ్ళకి సోమరితనం చేతులారా మప్పడం కదూ! ఇహను దానికే అలవాటు పడిపోతే మళ్ళీ తాతలు దిగొచ్చినా వాళ్ళు చేస్తారా? ఎందుకు చేస్తారు, అప్పుడు వాళ్ళది తప్పు కాదు! ఏమను కుంటే ఏం లాభం? అయితే ఇందులో మొగవాడిదీ తప్పులేదు. ఏంచేతంటే— పాదు తోలూకూ కొనని ఎటు తిప్పితే అటు వయిపే ప్రాకుతుంది. అది సహజం. అలాగే మొదటినుండి యేది అభ్యాసమైతే అదే అలవాటయిపోతుంది. ఆ అభ్యాసం కడతేరా వుంటేనేగాని తోచదు. ఆ తర్వాత మార్చదలుచుకున్నా మారదు!

అలాగే బేసిక్ ట్రయినింగు అయిన చంద్రం కూడా అక్కడ, వంట చెయ్యడం, గిన్నెలు తోమడం, బట్టలుతుక్కోడం, దారం తీయడం, తన వుచ్ఛిష్టం తనే ఎత్తుకోడం, తుడవడం, పెంట లెత్తడం, నీళ్లు తోడడం, పాదులు కట్టడం, యిలాటి స్వల్పమయిన పనులు నేర్చుకోవడంవల్ల అదంతా అలవాటయిపోయింది. పూర్తిగా వంటబట్టిపోయి అవి దినకృత్యాలకింద చెయ్యక పోతే తోచదు. మరో వ్యాపకం కలిగించుకోలేడు. ఎంతసేపూ వంటింటిమీదో మరో అలవాటయిన పనులమీదనో తనువు. అయితే వీటిలో కొన్ని మంచివి లేకపోలేదు. కాని అవి అంత తప్పనిసరిగా చెయ్యవలసిన, నేర్చుకోవలసిన, అవసరం లేదు. ఎందుకంటే -

ఇహమీదట ఏమోగాని యిప్పటివరకూ వంట మొదలయిన గృహ కృత్యాలు ఆడవాళ్ళే చేస్తున్నారు! గిన్నెలు తోమడానికి, తుడవడానికి యిలాటి చిల్లర పనులకి పని మనిషి వుంటుంది, బట్ట లుతకడానికి చాకలి అందరికన్నా ముఖ్యావసరం. ఇహను కష్టపడి సంపాదించిన డబ్బుతో కూరగాయలు, దినుసులూ మొదలయినవి, కొనుక్కుంటారు, ఇది ప్రతియింటోనూ సాధారణంగా జరుగుతున్న విధానం. అయితే యిదంతా మార్చి, యీ పనులన్ని తనే చేసుకుంటామంటే అది ఎందుకోసం? దానివల్ల ఖర్చు తప్పదు, డబ్బు మిగలదు, సరికదా వృథా శ్రమపడడం అవుతుంది.

అదీకాక మనకి అందుబాటులో వున్న యిలాటి ఏ చిన్న పనులో చేసుకోగలిసినా, ప్రపంచంలో ప్రస్తుతం ఎన్నో జీవితావసరాలు వున్నాయి. అవన్ని ప్రతీ ఒక్కరూ చేసుకోగలరా? అన్నీ స్వంతంగా కావాలంటే సబ్బులకోసం సబ్బుల ఫ్యాక్టరీ పెట్టగలడా? బట్టలకోసం మిల్లు పెట్టగలడా? ఒక వుద్యోగంలో వుంటూ దినుసులకోసం పొలంపని చెయ్యగలడా? అది అసంభవం.

అంచేత వీటన్నింటినీ సాధించేది ఒకటి వుంది - అది డబ్బు. దానికి సాధ్యం కానిది లేదు. అంచేత అది సంపాదించాలి. అందుకు ఉద్యోగం ఒక సాధనం. కాబట్టి, ఒక్కొక్క పని ఒక్కొక్కరు చేస్తేనే గాని, యిన్నింటి తయారుచేసి అనుభవించడానికి వీలుండదు. ఎవరు చేయవలసినపని వారే చెయ్యాలి! డబ్బు మూలంగా అన్నీ లభ్యం అవుతాయి, ఉద్యోగంమూలంగా డబ్బు దొరుకుతుంది. అయ్యవారి వుద్యోగానికి జీతం యిస్తున్నారు. ఆజీతం వినియోగించి ఎవరికి కావలసినవి వారి తాహతుప్రకారం సంపాదించుకుంటారు.

అయ్యవారి వుద్యోగధర్మం, పిల్లలకు సరిఅయినతోవలో పనికివచ్చే విద్య నేర్పడం, దానిమీదే కేంద్రీకరించి జీవితం ధారపోసి ఆ వచ్చే జీతంతో కాలక్షేపం చెయ్యడం. అంతేకాని, అంతా స్వయం కృషికావాలని పిచ్చిలో పడి వంటా, పెంటా యిటువంటివాటిలో పడితే తన విధి ఎలా నిర్వర్తించుకోగలడు? అటు స్కూలుకి పోయి పాఠాలే చెబుతాడా? యిటు యీ వెర్రి ఆదర్శాలనే పట్టుకు కూర్చుంటాడా?

పోనీ - బేసిక్ ట్రయినింగయిన అయ్యవార్లని, హైస్కూళ్ళలోనూ, మరికొన్ని చిన్న బళ్లలోనూ మేష్టర్లగా వేస్తున్నారు. అయితే యీ వుపాధ్యాయులు పొందిన శిక్షణ వేరు, యిక్కడ వీరు చెబుతున్నది వేరు, ఎలాగంటే - అక్కడ అయ్యవార్లకి బేసిక్ ట్రయినింగులో చెప్పి చేయించిన పనులు.—వంట వండడం, గిన్నెలు తోమడం, బట్టలుతుక్కోడం, పెంటలూడవడం, నీళ్లుతోడడం, యిలాటివి. ఇవి హైస్కూళ్లలోనూ, ఆ చిన్న బళ్లలోనూ చెబుతున్నారా? - యిప్పటివరకూ లేదు! అంచేత వీరు నేర్చుకొన్న విద్య ఒకరికి చెప్పకపోడంచేత వృథాఅయిపోదా? అటువంటప్పుడు ఆ అయ్యవారలకు మాత్రం ఆ శిక్షణ ఎందుకు? ఎవరికోసమని ఆ శిక్షణ! యింకా మిగిలిన ముఖ్యమయినవి ఎన్నో

"క్షమించాలి! మా యింటి కోడి మీ తోటలో మొక్కలన్నీ కుళ్లగించేసిందట!"

"మొక్కలకేమిటి కానిండీ—మీకోడి, మాకుక్క కొరికి చంపేసింది."

"పోన్లెండి! మీ కుక్క మా కారుకింద పడి చచ్చిపోయింది."

## నపుంసక తైలం

అంగనరములు బలహీనతచెంది చిన్నదైనదిరిగి యథాప్రకారమై పూర్తి సౌఖ్యమును అనుభవించుటకు 48ఏండ్లుప్రఖ్యాతి చెందిన గ్యారంటీ మందు. 1 సీసా రూ 10/-లు. V. పి. రూ 1-4-0

కావలసినవారు రు. 1/4 ముందుగా పంపేది.

**డా॥ రత్నం సన్సు మెడికల్ హాల్,**
**మలకపేటబిల్డింగ్సు, హైద్రాబాదు-(దక్షిణ)**

గవర్నమెంటు ఎందుకు చెప్పలేదు? ఉద్యోగం చేస్తూ అవన్నీ చెయ్యలేడు గనక, ఆ వృత్తులకి వేరే తరగతులు వున్నాయి గనక, యీయన కిచ్చే జీతంతో వాటిని కొనుక్కొని జీవించగలడు గనుక చెప్ప లేదు. అయితే ఆ నాలుగు పనులూ మాత్రం ఎందుకు చెప్పాలి! ఇలా ప్రతిమనిషి తన కుటుంబంలో అందరిచేతా చాకలిపని, పాలిపని, పాకీపని, పొలంపని, మంగలిపని అన్నీ స్వయం చేసుకుంటూపోతే బాగానే వుంటుందిగాని, చాకలి, మంగలి, దాసి మొదలైన చిన్న జీతగాళ్లందరూ ఏమవుతారు? అప్పుడందరూ వుద్యోగస్థులవాలి!

అందరూ అందలమెక్కితే మోసేవా రెవరన్నట్టు అవుతుంది. అసలు భగవంతుడు మొట్టమొదటే పప్పులో కాలువేసేడు! సృష్టిలో మొగ, ఆడ అని వేరు చెయ్యడమే తప్పు!

అయితే యీ బేసిక్ట్రయినింగు అని యింత శ్రమ ఎందుకు పడుతున్నారూ అని ఆలోచిస్తే—మనలో మన మాట: - యీ అయ్యవార్ల కిచ్చే జీతం తక్కిన వారితో పరిపోల్చి చూస్తే చాలా తక్కువ కాదా? చీటికీ మాటికీ జీతాలు ఎక్కువ చెయ్యండి, ఎక్కువ చెయ్యండి అని, నిప్పుల్లో పడిన మిరపకాయల్లా ఘాటు ఘాటుగా ఒక్కొక సారి లేస్తూంటారు! వీళ్లనోరు నొక్కా లంటే ఒకటే పద్ధతి. అదేమిటీ అంటే వీళ్ల యింటి ఖర్చు సాధ్యమయినంతమట్టుకు తగ్గించివేయడం! అదెలా సాధ్యమవుతుంది? వృత్తి పుణ్యానికెవరూ సహాయం చెయ్యరు కదా? అంచేత విలువయినవీ, ముఖ్యమయినవీ అయిన పనులు చెప్పకపోయినా చాకలిపనీ, మంగలిపని, కూరగాయలు పండించడం, అంగుళంపాటి వత్తి దారాలు తియ్యడం, యిలాటి ఎన్నో చిన్న చిన్న నిత్యావసరాలని కొన్నిటిని మప్పితే, జీతం చాలనప్పుడు, అవి ఎలాగూ వచ్చును కనుక చచ్చినట్టు అటువంటి పనులన్నీ స్వయంగా చేసుకొని ఆ ఖర్చులు మిగుల్చుకుంటాడు. మాటిమాటికి జీతం హెచ్చింపు కోసం ఆందోళన చెయ్యడు. ఇలా చేస్తే దెబ్బకి రెండు లాభాలని...అనే వుద్దేశ్యం అయివుండొచ్చు. ఇది నిజం అయినా అబద్ధం అయినా, అనుకోడంలో తప్పేమీ లేదు.

చంద్రం అటువంటి ఆలోచనాల్లో పడిపోయి, సంసారంలో కలతలు తెచ్చుకున్నాడు, కమలకి ఏవో కొన్ని విషయాల్లో చంద్రం స్వభావం నచ్చినా, యిటువంటి వాటిల్లో అతనితో కలియలేకపోతూంది. అవసరం లేని వాటిల్లో కలుగజేసుకొని వృథా బాధపడుతున్నాడని ఆమె విచారం. పోనీ డబ్బేమన్నా మిగులుతూందా అంటే అదీ లేదు. ఒట్టి శ్రమ, చాకిరీ మాత్రం మిగులుతున్నాయి. బాధ్యత లేని పనుల్లో చెయ్యి చేసుకుంటే ఏమవుతుంది? అలవాటు పడ్డ వాడవడంవల్ల నయితేనేమి - ఆర్థికంగా నయితేనేమి, మానసికంగా నయితేనేమి స్వభావికంగా నయితేనేమి, మంచికయితే నేమి చెడ్డకయితేనేమి, చంద్రం సంగతి విచిత్రంగానే వుంది.

రోజు రోజుకీ చంద్రానికి పిచ్చి లాగయి పోతూంది. ఏదయినా చిన్న కారణం కనబడితే చాలు తనకి అన్నీ వచ్చునన్న భావంతో ఇంట్లో జీతగాళ్ళనందర్నీ మానిపించేయడం మొదలెడుతున్నాడు. ఆనాడు చాకలివాడు వచ్చేడు, ఆనవాయితీ ప్రకారం ఆనాడేదో గుడ్డ యివ్వలేదు, దానికితోడు మరో పొరలా అయినా ఎక్కువ చేస్తేనే గాని కష్టం తీరదన్నాడు. యీ నెపంమీద

(52-వ పేజీ చూడండి)




# వంట నేర్పిన భర్త

(9-వ పేజీ తరువాయి)

చంద్రానికి పరువునష్టం అనిపించి మానిపించేశాడు. కాని ఏం సుఖపడ్డాడు? నీళ్ళు వంచి, గంటలకొద్దీ కాలం వృధాపరిచి వుతకడమే గాని. ఒక బట్టా తేటు రాలేదు. మురికి వాసన మెతగవాసనా ఎంత వుతిగినా పోలేదు. వాడిని మానిపించిన లాభం లేకపోగా చాకలి సోడా, నీలిముందూగాని, బట్టలసబ్బుగాని కొనాలి! బొగ్గుల ఖర్చు, కర్రల ఖర్చు, యివన్నీ పెట్టుగునే కన్న — మొత్తంమీద అందరి బట్టలూ వుతికేవాడు చాకలి కాబట్టి వాడికే కిడుతుంది, వాడే చవుక అనిపిస్తుంది! అదీకాక ఇస్త్రీ లేనిదే బట్ట కట్టలేం! దానికోసం అధమం 5 రూపాయలయినా యిచ్చి కకుర్తి పడాలి! ఆ అయిదు రూపాయలూ యిస్తే - అర్థ సంవత్సరంపాటు మాటాడకండా వుతికే చాకళ్లు యింకా వున్నారు! చాకలి ఏవాడో ఒక చిన్న బట్ట పారేసేడూ అంటే పూర్తిజ్ఞానం, అనుభవం లేని యీ స్వయంకృషివల్ల ఎన్ని బట్టలు యిస్త్రీ పెట్టెకి అహుతి అయిపోతాయో! ఇక మంగలి పని. రకరకాల క్రాఫింగులు ఛాలెంజిమీద కత్తిరించే మంగలివాడే తన బుర్ర తను గీసుకోలేడు!

నాలుగురోజులు కదురాడించినంత మాత్రంలో తనకీ తన భార్యకీ కుటుంబానికీ సరిపడ్డ బట్ట తనొక్కడు తయారు చెయ్యగలడా? అలాగని యీ పని చెడ్డదని కాదు. దారం తీయవచ్చు. దానిని వుపయోగించే విధంగా వుపయోగించాలి! అంతే గాని చంద్రంలాగ తను తీసిన అంగుళం దళసరిదారం బట్టనేయించి, పిడుక్కి బియ్యానికీ ఒకటే మంత్రంలాగు, చొక్కాలకీ, చీరలకీ, పంచలకీ, అంగవస్త్రాలకీ, ధోవతులకీ ఆ ఒక్క బట్టే ధరించగలరా? యిహ నటువంటి బట్ట కట్టుగొని భార్యని చూసి తనూ తనని చూసి ఆమె ఏం ఆనందించగలరు? బ్రతికిన మూడురోజులూ ముచ్చటగా వుండక యిదవడు చెప్పిన బుద్ధి? వీ డెలాగయినా కకుర్తి పడగలడు గాని యింట్లో ఆడది వూరుకోగలదా? కొత్త రకం కనబడితే చాలు కొనుక్కొని కట్టుగోవాలని వాళ్లకి వుంటుంది! అటువంటిది కూర్చుంటే లేవలేనంత బరువయిన ఖద్దరు చీర కట్టుకు పడివుండమనడం ధర్మమా! అలాగని ఖద్దరు చీరలుగాని బట్టలుగాని కట్టకూడదని కాదు, ఇష్టమయినవాళ్లు కట్టుగోవచ్చు, నిర్బంధించకూడదు! కాని చంద్రం అలా కాడు!

అతడికి కులాసాగా ఒక్క ఘడియ కాలక్షేపం చేద్దామంటే తీరికలేదు. అస్తమానూ ఏదో ఒక పని, అదీ పనికొస్తుంది అనుకొనే పనికిరానిపని.

పట్టుదలగల మనిషి కాబట్టి ఎలాగో సాగుకొస్తున్నాడుగాని కమల పరిస్థితి మరీ విషమించిపోయింది. కోతిపిల్ల సామ్యంలాగ అతనేం చేస్తే అది చెయ్యవలసి వచ్చింది. ఆఖరికి ఆమెకి జీవితంమీద విసుగూ, విరక్తి చిరాకూ, నిరాశ ప్రవేశించేయి. తన తోటివాళ్లు యీ యీడులో యిలాగే వుంటున్నారా? జీవితంలో ఎంతో ముచ్చటగా, ఆనందంగా లోకాన్నీ శరీరాన్నీ మైమరచి సుఖించవలిసే రోజులన్నీ వృధాగా స్వయంకృతాపరాధంవల్ల పాడయిపోతున్నాయి. ఆ వయస్సులో మూడుపువ్వులూ ఆరుకాయలుగా వుండవలిసింది!

మొదట్లో వైవాహిక జీవితం, భర్తతో కాపరం, కొత్త స్నేహం అంటే ఏమిటో ఎన్నో కలలు కన్నది. కాని అవన్నీ చూస్తుండగానే అంతరించిపోయేలాగున్నాయి. జీవితం ఎంతచూసినా అంధకారంలా వుంది. రాత్రి పగలూ ఆమెకి అదే ఆలోచన పట్టుకుంది! తన జీవితాన్ని ఎలాగయినా యధారీతికి తీసుకురాగలదా? భర్త దృష్టి మరల్చగలదా? ఏమో అటు చంద్రాన్ని చూస్తే అతనికీ రాత్రిళ్ళు నిద్రపట్టడం లేదు. తిన్న తిండి ఒంటికెక్కడంలేదు! అతివేడి చేసింది, శరీరం నల్లగా మారిపోయింది! దవడలు కళ్లు లోతుకి దించుకుపోయేయి. ఎప్పుడూ దీర్ఘరోగిలా వుంటున్నాడు!

ఇదంతా ఎందుచేతో కమలకి పూర్తిగా తెలుసు. అనవసరంగా బాధపడడం, వంటికి తెచ్చుకోడం దేనికని రోజూ చంద్రంతో చెబుతూనే వుంది! కాని - అతను వినడు.

ఆరోజు చంద్రం వంటకాలన్నీ సిద్ధంచేసి బయటకు వెళ్లేడు. కమలకు ఒక బుద్ధి పుట్టింది. నెమ్మదిగా వెళ్ళి యింత వుప్పూ కారం, తీసుకొచ్చి, కూరల్లోనూ మిగతా వాటిల్లోనూ బాగా కలిపేసింది. అన్నం తీసుకుపోయి తిరిగి పొయ్యిమీద పెట్టి పావుఘంటసేపుంచి తీసేసింది. ఏమీ ఎరగనిదానిలా చంద్రాన్ని భోజనానికి పిలిచింది. కథ పూర్తి అయినతర్వాత ప్రసాదంకోసం కనిపెట్టుగున్నట్లు మహా ఆత్రుతగా కూర్చున్నాడు. విస్తట్లో ఒక్కొక్క పదార్థం వేస్తూంది. పేకాటలో ముక్కలన్నీ పంచిన తర్వాతగాని కొందరు తీసి చూసుగోరు చంద్రం అలాగే అన్నీ వడ్డించడం అయేవరకూ వున్నాడు. అన్నంగిన్నె తెచ్చింది ఆ అన్నం గరిటెతో స్వాధీనం కాలేదు! సాక్షాత్తూ పరబ్రహ్మస్వరూపమయిన అన్నం తాలూకు అప్పటిస్థితి చూడగానే చంద్రానికి అనుమానం తగిలింది! ఆఖరికి గిన్నె బోర్లించి మీదని కొట్టగా కొట్టగా, పుసుక్కని దిగజారింది సున్నవుండలాటి అన్నం ముద్ద. చంద్రం చెయ్యి చేసుకున్నాడు. అన్నంమాట చూడగానే నిశ్చయించుకున్నాడు. మిగిలినవి రుచిచూసేడు. అబ్బే! ఒక్కొక్కటీ నాలికమీద పెడుతూంటే నైట్రికేసిడూ, పొటాసియంసైనేడూ ఇలాంటివిరాసుకుంటున్నట్టుంది. నాకిలికఅగుంట్లో లాక్కుపోతూంది! అవన్నీ అలాగే వుంచేసి కాస్త మజ్జిగ ఆ సొజ్జిలో పోసుకొని క్షుద్బాధ తీర్చుకున్నాడు.

అతనికి చాలా ఆశ్చర్యం వేసింది. తన వంటలో యిలా గెప్పుడూ అవలేదు! అసలు వంట నేర్చుగొనే కొత్తలోనయినా దేనిలోనూ అరుచి కలిగేట్టు వండలేదు! వండగా వండగా తన వంట తనకే ఏవగింపుగా వుందేమో! ఛా! ఛా!!—జిహ్వ ఒకటి మధ్యవర్తిగావుండి చెపుతున్నాది కదా! కమలని రుచిచూడమన్నాడు! ఆవిడ కూడా అదోలా ముఖంపెట్టి అన్నిటినీ అవతలకి నెట్టేసింది!...

చంద్రానికి చిన్నతనం అనిపించింది! దానికితోడు అతని అభిమానానికి ఆఘాతం తగిలింది. నోరెత్తి ఏదీ అనలేకపోయాడు! ఒక్కటే విచారం పట్టుకుంది! ఎందుకిలా అవాలి? మరిచిపోయి రెండోమాటు ఉప్పుకారం వాటిల్లో వేసే డనుకుంటే, అన్నం మాట? సరిగ్గా మగ్గేవేళకి దింపేశాడే! చంద్రానికి పట్టుదల లావయింది! కాని ఏం చెయ్యగలడు? ఏదో పొరపాటు జరిగివుంటుంది, లేదా తనెప్పుడో చూసుకోకండా రాజుతున్న పొయ్యిలో నీళ్లుపోసి వుంటాడు!

కమలకి కారణం తెలుసు కాబట్టి అట్టే ఆలోచించలేదు. అన్ని వస్తువులూ అలాగే పారపోసింది...తను అనుకొన్నది నెరవేరితే కొన్నాళ్లపాటు తన ఆరోగ్యం భర్త ఆరోగ్యం సరిఅయిన తిండిలేక పాడయినా సరే ఒప్పుకుంటుంది. ఆఖరికి యిదొక్కటే వుపాయంలా కనిపించింది ఆమెకి. కాని—చంద్రానికి పట్టుదల, పంతం లావయింది. ఆ మర్నాడు అతిజాగ్రత మహాజాగ్రతగా పాకశాస్త్రాన్ని పాకంతీసి సాగదీసి మరీ వదిలేడు. కాని భోజనాల వరకూ అక్కడే కూర్చోడు కదా, వేరే బట్ట కట్టుకుందికయినా వెళ్లాలి! అయినా వండడం అంటే తన పనిగాని వడ్డించడం కమల

పనేగా! ఎలాగయినా వండుచేసుకోగలదు. యింతకీ యీ పని కమల చేస్తున్నదని అనుమానమయినా కలగలేదతనికి.

అన్నీ పాడుచేస్తే ప్రయత్నపూర్వకమే అని తెలిసిపోతుందని కమల ఆనాడు కొన్నిటిని మాత్రమే నోట్లో పెట్టలేనట్టు చేసింది. చంద్రానికి క్రిందటిరోజుకన్నా ఎక్కువ విచారం పట్టుకుంది దానితో కోపం లావయింది! ఎవరిని ఏమనడానికీ వీలులేక ఆ కోపం, అహంభావం, అంతా దుఃఖం కింద మారింది. కాని అది సహించేడు—ఎంతో జాగ్రత్తపడినా యిలా ఎందుకయిందని మనసులో కృంగిపోయేడు. కమలని నాలుగయిదుసార్లు కారణం అడిగేడు. ఆమె తెలియనట్టే జవాబు చెప్పేసింది; ఆవేళ సరిగ్గా భోజనం తినలేదు, సహించక లేచి వెళ్ళిపోయేడు.

కమల చెదరలేదు, మొగుడలా అర్థాకలితో వెళ్ళిపోయినా సహించి తన ప్రయత్నంమాత్రం మానలేదు! యిలా రోజానిదో ఒకటి చెడిపోతూంటే, తన గొప్పదనం, శక్తి చూస్తూ చూస్తూండగా పోతున్నట్టయింది చంద్రానికి. తనమీద, తన వంటమీద విసుగూ చికాకూ అసహ్యం పుట్టనారంభించింది: సంపూర్ణసిద్ధి పొందిన శిల్పి, ఒక్కసారిగా అకారణంగా తయారుచేస్తున్న శిల్పాలన్నీ పాడవుతూంటే అతనికి ఎలా వుంటుంది? తన చేతిలో శిల్పం ఏమయిపోయిందని, అహో రాత్రాలూ, ఆలోచిస్తూండిపోడా?

ఇరవయినాలుగ్గంటలూ విసుక్కోవడం చిరాకుపడడం మొదలెట్టేడు. కాని ఎన్నాళ్లా సరిఅయిన తిండి లేకుండా వుంటారు? చంద్రానికి పూర్వపు నీరసంతోపాటు యిప్పుడు తిండిపుష్టిలేక శక్తి తగ్గిపోయింది. మనిషి పిచ్చెత్తినట్టున్నాడు! మనసు పాడయింది! ఇహ నీ వంటపీడ వదిలిపోతే బావుండు ననిపించింది, చేద్దామన్నా శక్తి లేదు! కాని తనంతట తనే పురస్కరించుకొని కమలని వద్దని వంటపనికి నడుం కట్టేడుకదా? ఇప్పుడు తనే తిరిగి కమలతో ఆ సంగతి చెప్పగలడా? చింత చచ్చినా పులుపు చావదన్నట్టు, అతని అభిమానం ఒప్పుకుంది కాదు! కాని ఏ నిముషాన్ని తెగించి చెప్పేద్దామా? అని చూస్తున్నాడు! కమల యిది గ్రహించి అతని వైఖరీ, మనసులో జరుగుతున్న పోట్లాటకి నవ్వుకుంటూ అతనిదగ్గరికి వచ్చింది.

“ఏమండీ అదే మనసులో పెట్టుకొని రోజూ సరిగ్గా తిండి కూడా తినడంలేదు. మరీ చిక్కిపోతున్నారు! పోనీ కొన్నాళ్లూరుకోరాదూ! నేను వండుతాను వెధవ వంట, నేను లేనా ఎలాగో ఒకలాగ వండడానికి? ఒకదానిమీద పట్టుపట్టి దానిమీదే అతి జాగ్రత్త చూపిస్తే అప్పుడే అది ఎక్కువ పాడవుతుంది. అయినా మీకెందుకా బాధ? దానికోసం యింట్లో ఒకరు వుండగా? చదవగా...చదవగా...అన్నట్టు—మొదటివాడికి అతి తెలివి లావయిపోయి—రెండోవాడికి పనిలేక సోమరితనం లావయి—రెండువిధాలా చెడడం అవుతుంది. నా మాట వినండి” అని యెంతో అంత ఋదిగా చెప్పింది.

ఎలాగో ఒకలాగ యీ బాధ వదుల్తే చాలని చూస్తున్న చంద్రం ఆవిడ మాటల్లో వెగటు, వెటకారం, ఎత్తిపొడుపులూ ఎన్నివున్నా ఏమీ అనలేక పైకిమాత్రం – “సరే అలాగే కానిద్దూ...ఒకరు బాగాచేస్తున్నారని ఓర్వలేకపోతే ఏమి టవుతుంది...ఆ పేరు నువ్వే పొందు!” అన్నాడు...ఇహ నతనితో మరేమన్నా ఘర్షణ తప్పదని కమల వూరుకుంది. తన హక్కులలో ఒకటి శాంతి మార్గంలో సంపాదించుకున్నందుకు—తన పద్ధతి ఫలించినందుకూ సంతోషించింది. ఇహ ప్రతీ విషయంలోనూ యీ పద్ధతే వుపయోగించడం మొదలెట్టింది. అయితే అదీ ఎంతో నేర్పుతోనూ అనుమానం కలగకుండానూ చేస్తూంది. అది మొదలు వంటపదార్థాల్లో మరి తంటా ఏర్పడలేదు చంద్రం మరి వంటజోలికి పోనూ లేదు! పూర్వం తను వంటచేసి తినేటప్పటికి సరిగ్గా వంటబట్టేది కాదు ఏదో తినాలికదా అని ఎంగిలి పడేవాడు కాని యిప్పుడు తిన్న తిండివల్ల ఫలితం కనబడుతూంది.

ఒకనాడు చంద్రం యధాప్రకారంగానే తను స్వంతంగా తీసిన దారంతో నేయించి తెచ్చిన గోనెలాటి నేత తాను ఒకటి కమలకి చూపెట్టేడు. తర్వాత ఒక చిలక్కొయ్యకు తగిలించి వుంచేడు...

కమలకి అదో మనోవ్యథ అయిపోయింది! ఆ బట్టని చూడగానే ఆమె శరీరం ఆమెకే బరువయినట్టుండేది. ఆ ఖద్దరులో నేసా సన్నందితే కమల ఏమీ అనకపోనుగాని తను తెచ్చిన ముతగతానులోనే, చీరలకీ, చొక్కాలకీ, తువ్వాళ్ళకీ దుప్పట్లకీ, పంచలకీ, జాకెట్లకీ, చింపుగొని కట్టుగొమంటాడు. అతని కిష్టమయితే అతను అలా వుండొచ్చుగాని మరో వ్యక్తిని కూడా అలాగే వుండమని నిర్బంధిస్తేమట్టుకు చికాకే! అతని ముందర కమలేమీ అనలేదు.

ఆమర్నాడు, ఆబట్టని జాగ్రత పరచడానికని కమల విప్పిచూసింది! ఒకటి రెండుచోట్ల ఎలకలు కొట్టేశాయి.. కమలకి విచారం కలగలేదు సరికదా మరో ఆలోచన తట్టింది. వెంటనే ఆతానుని విభాగం కూడా పనికిరానట్టు అలాటి చిల్లులే పెట్టేసింది. ఎప్పటిలాగే చిలక్కొయ్యకు వుంచేసింది.

చంద్రంవచ్చి, అన్నిటికీ పనికి వచ్చినట్టు పంపకాలు చెయ్యడానికి తాను తీసేడు! యింకేం వుంది! ఎందుకూ పనికి రాకుండా తాను తానంతా కన్నాలు పడిపోయింది! కమలకు చెప్పేడు. ఎలకలు కొట్టేశాయని. యిద్దరూ వాటిని కసిదీర తిట్టేరు. “తెచ్చి పెట్టిలో పెట్టలేకపోయారా?” అని కమల మీదుమిక్కిలి అడిగేటప్పటికి చంద్రం ఏమీ అనలేక వూరుకున్నాడు.

ఆ ఏడాదికి సరిపడ బట్టంతా వృధా అయింది! నష్టమయిపోయింది! మళ్లీ కొనుక్కోపోతే తనకీ, భార్యకీ కూడా బట్టలు లేవు. తను కష్టపడి ఒడికిన నూలు అంతా కలిపి యీతాను నేయించేడు. మరి నూలు లేదు. ఇంక బజారులో కొనక తప్పదు! మళ్ళీ ఖద్దరే కొంటానని చెప్పేడు కాని కమల ఒప్పుకోలేదు, కొనడం యిష్టంలేకపోతే పూర్తిగా మానేయండిగాని ఆ బట్ట మరి కట్టలేనని చెప్పేసింది. చంద్రం ఏమీ చెయ్యలేకపోయాడు..ఆమెకి ఒక మంచి చీరకొని తెచ్చేడు. తనుమాత్రం మంచి రకం ఖద్దరు తెచ్చుకున్నాడు... ఇది నాంది కాగానే మరి చంద్రం ఖద్దరు బట్ట కమలకి కొనలేదు...రాను రాను తనూ అప్పుడప్పుడు మిల్లుబట్టలు వాడేస్తున్నాడు.

ఈ రెండు సంఘటనలూ యిలా జరగడంతో చంద్రం పూర్తిగా మారిపోయేడు. యిప్పుడు కమల ఏం చెబితే అది చేస్తున్నాడు పూర్వపు పట్టుదల మంచిదికాదని అతనికి అర్థమయింది కాబోలు. ఆ తర్వాత వాళ్ల బట్టలు చాకలాడు నాలుగు రేవులు వుతికితేగాని అసలు రూపుకి రాలేదు యింట్లో పై పనులు పనివాళ్లు చేసుకుంటున్నారు కాబట్టి కమలకి చంద్రానికీ కాస్త మాటాడుకుందికి తీరుబడిఅయింది.

పాతబడిపోయిన ఖద్దరు బట్టలన్నిటినీ, చిల్లులుపడిన కొత్తతానుతో కలిపి కమల బొంత కూర్చేసింది...బొంత కుట్టేసింది

★

కుష్ఠం ★ బొల్లి
వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స. క్యాటలాగు ఉచితము:
సలహాకు జి. ఏ. రెడ్డి & కో. (రిజిష్టర్డు)
“భాస్కరాశ్రమము”
గోపాలపురం. తూర్పుగోదావరి